తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

శుక్రవారం

06 నవంబర్ 2026

Follow :



మత్తు వదలరా యువతా...

జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్న యువత

- సాయంత్రం 7 దాటితే చాలు.. మత్తులో మునిగిపోతున్న కొందరు యువకులు!
- యువత చేతిలోనే దేశ భవిష్యత్తు.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- యువతను సన్మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజానిదీ!

కోహిర్, నవంబర్ 5 (జనంసాక్షి):
యువతంటే మార్పును ఆశించే నవతరం. కొత్త ఆలోచనలతో, పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ దేశ భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన యువతలో కొందరు నేడు చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూదం వంటి వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

సాయంత్రం 7 దాటితే చాలు.. మత్తులో జోగుతున్నారా?

పగలంతా ప్రైవేట్ సంస్థల్లో కష్టపడి పనిచేసే కొందరు యువకులు సాయంత్రం కాగానే మద్యం మత్తులో మునిగిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొందరు తల్లిదండ్రుల కష్టార్జితాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ స్నేహాల పేరుతో చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. చిన్న వయసులోనే మత్తు పదార్థాల ప్రభావానికి లోనవడం, వాటిని క్రమంగా అలవాటుగా మార్చుకోవడం భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

క్షణిక ఆనందం కోసం మొదలైన వ్యసనం చివరకు ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, సామాజిక సమస్యలకు కారణమవుతోంది.

ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఆకర్షితులై అప్పుల పాలవుతున్న యువకుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది.

మిగతా 9లో..



మిగతా 9లో..

అక్రమ మట్టి రవాణాతో ప్రభుత్వ ఖజానాకు గండి

- అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో మట్టి వ్యాపారం?
- మట్టి అక్రమదారులకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బేరసారాలు కుదుర్చుకున్నారని గుసగుసలు

మిడ్జిల్, నవంబర్ 5 (జనంసాక్షి): మండలంలోని పలు గ్రామాల్లో కే ఎల్ ఏ కాలువ సమీపంలో ఉన్న మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్ల ద్వారా బడా వ్యాపారస్తులకు మండల అధికారులు.ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు మండల నాయకుల అండదండలతో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అనుమతుల, నిబంధనలను పట్టించుకోకుండా మట్టి వ్యాపారం సాగుతుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ అక్రమ వ్యాపారానికి కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం ఉందని, వ్యాపారులు, ప్రజాప్రతినిధుల మధ్య బేరసారాలు. కొనసాగుతు. భారీగా ముడుపులు ముడుతున్నాయని. స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

అక్రమ మట్టి రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై సమగ్ర

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల సమీకరణ, రవాణా, భద్రత, భోజన వసతులు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

ఈ నెల 7న రైతుల సమీకరణ, 8న దీపావళి సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల సమీకరణ, 9న బహిరంగ సభకు ప్రజల తరలింపునకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల వారీగా సమీకరణ లక్ష్యాలను నిర్దేశించి, ఎంపీడీవోలు, ఎంపీఓలు, గ్రామ కార్యదర్శులు, ఏపీఎంలు, సీసీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ నెల 8న హకీంపేటలో ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మహిళలను తరలించే బస్సులు ఉదయం 7.30 నుంచి 8 గంటలలోపు చేరుకోవాలని, ప్రతి బస్సుకు ఒక గ్రామ కార్యదర్శి లేదా జీపీఓను బాధ్యుడిగా నియమించాలని ఆదేశించారు. బస్సులు బయలుదేరే ప్రాంతాల్లో అల్పాహారం, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలని సూచించారు.

హకీంపేటలో రైతుల కోసం వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు, శిక్షణ కార్యక్రమాలు, పరికరాలు, ఆస్తుల పంపిణీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల కోసం స్వయం సహాయక సంఘాలు, సెర్ప్, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సుమారు 100 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

9న జరిగే బహిరంగ సభకు మండలాల వారీగా బయలుదేరు కేంద్రాలు ఏర్పాటు చేసి, భోజన వసతులతో ప్రజలను తరలించాలని సూచించారు. సీఎం తిరుగు ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు, మిషన్ భగీరథ, వీబీ జీ రామ్ జీ పథకాల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్డీవో వెంకట్ రాములు, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మద్దిగట్ల చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు!

- రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు.. అడ్డుకున్న గ్రామస్తులు
- వాహనాలను గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలించి అధికారులకు అప్పగింత



వనపర్తి / పెద్ద మందడి నవంబర్ 5 (జనంసాక్షి):
మండల పరిధిలోని మద్దిగట్ల గ్రామ శివారులో ఉన్న చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు వెలుగులోకి వచ్చాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో చెరువులో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా మెట్టుపల్లికి తరలిస్తున్నట్లు గుర్తించిన గ్రామస్తులు మట్టి రవాణాను అడ్డుకున్నారు.

చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు నిలిపివేసి, వాటిని గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం వాహనాలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఈ అక్రమ మట్టి తరలింపు వ్యవహారంలో వనపర్తికి చెందిన ఓ వార్డు కౌన్సిలర్ ప్రమేయం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతులు ఎవరు ఇచ్చారు? రాత్రి వేళల్లో మట్టి తరలింపు వెనుక ఎవరున్నారు? ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ చెరువుల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలించడం వల్ల చెరువుల పరిరక్షణకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ తవ్వకాలపై విచారణ చేపట్టి, బాధ్యులు ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వనపర్తి జిల్లా అభివృద్ధిలో మరో ముందడుగు

- ప్రజలకు మరింత చేరువగా బ్యాంకింగ్ సేవలు
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి):
జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బ్యాంకు శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలి శాఖ ఏర్పాటు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ బ్యాంకు ద్వారా రైతులు, వ్యాపారులు, మహిళలు, యువతకు మెరుగైన ఆర్థిక సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.వ్యవసాయ రుణాలు, విద్యా రుణాలు, గృహ రుణాలు, వాహన రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయాలతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన బ్యాంకింగ్ సేవలను ప్రజలకు సులభంగా అందించాలని అధికారులను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలు, రుణ



సదుపాయాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా వనపర్తి జిల్లా అభివృద్ధిలో బ్యాంకు భాగస్వామ్యం కావాలని, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా జిల్లాలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం



అందించాలని బ్యాంకు ఉన్నతాధికారులను ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు ఆర్థిక సేవలు అందించడంతో పాటు స్థానిక అభివృద్ధిలోనూ బ్యాంకు తనవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బ్యాంకు జోనల్ హెడ్ ఎం. పిచయ్య, రీజినల్ హెడ్ జి.ఎస్. చౌహాన్, వనపర్తి బ్రాంచ్ హెడ్ రామావత్ చంద్రు, మున్సిపల్ చైర్మన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మంచారి, కౌన్సిలర్లు, బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ మేటీలకు శిక్షణ

మద్దకల్, నవంబర్ 5 (జనంసాక్షి):మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పనులు చేపడుతున్న ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా మేటీల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిజిరాంజీ పనిచేసే ఉపాధి కూలీలకు 40 మంది గ్రూప్‌గా ఏర్పడి ఒక మేటిని ఎన్నుకున్నారు. మేటీలకు పని ఏ విధంగా చేయించాలి ఎంత పని చేస్తే 308 రూపాయలు కూలి పడుతుందని, దీనిపైమేటీలకు అవగాహన కల్పించారు. మేటీల శిక్షణలో కొలతల ప్రకారం పనిచేసి కూలీలకు ఆర్థిక పరుపుష్టికి సహాయపడుతుందన్నారు. ఈ శిక్షణలో 70 మంది మేటీలు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధిఅధికారిఆంజనేయరెడ్డి,ఏపీవో సుజాత, మేటీల ట్రైనింగ్ కోఆర్డినేటర్ సుజ్ఞానం కార్యాలయం ముందు మ్యాప్ ద్వారా ప్రొజెక్టర్ ద్వారా మేటీలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టిఏలు, అనూష, ప్రమీల, ఉమ్మెర సుల్తాన్, నరేష్, సీనియర్ మేటీలు, కంప్యూటర్ ఆపరేటర్లు నాగేష్, రాజబాబు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గానికి నిరంజన్ రెడ్డి అభినందనలు



వనపర్తి రూరల్, నవంబర్ 5 (జనంసాక్షి): పట్టణ స్వర్ణకార సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గన్నోజు మోహన్, ప్రధాన కార్యదర్శి పి. నవీన్ చారిలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గురువారం తన స్వగృహంలో శాలువాలతో సత్కరించి అభినందించారు. మోహన్ వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆయన సేవలకు నిదర్శనమన్నారు. నూతన కార్యవర్గం స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి, సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వింజపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కోహెడ, నవంబర్ 05 (జనంసాక్షి):
మండలంలోని వింజపల్లి గ్రామంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.
ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు అవసరమైన వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అనారోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు తగిన సలహాలు, సూచనలు అందించారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకరించిన మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య సిబ్బందికి సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద శంకరంపేట్‌ను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిమాండ్

పెద్ద శంకరంపేట, నవంబర్ 5 (జనంసాక్షి): పెద్ద శంకరంపేట్ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పెద్ద శంకరంపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ...

మండలంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోవడంతో రైతులు పెట్టుబడులు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు ఎమ్మెల్యే ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, రైతుబంధు నిధులను ఎలాంటి జాప్యం లేకుండా రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కరువుతో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.





రైతులకు భరోసాగా ఉన్న రైతుబీమా పథకాన్ని నిలిపివేసే ప్రయత్నాలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్ద శంకరంపేట్ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు యదుల, సర్పంచులు కోణం అంజయ్య, సాయిలు, విఠల్ నాయక్, పలువురు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు.. నూతన పీఏసీఎస్ చైర్మన్లకు ఉత్తర్వుల కాపీలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేత

కల్వకుర్తి,నవంబర్ 05,(జనంసాక్షి):
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు, వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ఎల్ఓసీ పత్రాలను అందజేశారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులను వ్యక్తిగతంగా పలకరించి, వైద్య చికిత్సకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్మన్లు ఎమ్మె ల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు.కల్వకుర్తి మండల పీఏసీఎస్ చైర్మన్‌గా రఘుపతిపేటకు చెందిన హరీష్‌రెడ్డి నియమితులయ్యారు.
ఈ సందర్భంగా నూతన చైర్మన్లు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే వారికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను అందజేసి శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులే కేంద్రబిందువుగా ఉండాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు తదితర సేవలను సకాలంలో అందించాలని, ఎలాంటి







అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని నూతన చైర్మన్లకు సూచించారు. తమపై ఎమ్మెల్యే ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తామని నూతన చైర్మన్లు పేర్కొన్నారు.

బస్సు నుంచి జారిపడి విద్యార్థికి గాయాలు...

• విద్యార్థుల భద్రతపై ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమంటూ స్థానికుల ఆందోళన





కొల్చారం, నవంబర్ 05 (జనంసాక్షి): కొల్చారం మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సుఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ విద్యార్థి గాయపడిన ఘటన చోటుచేసుకుంది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన రియాజ్ (14) కొల్చారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు కొల్చారం బస్టాండ్‌కు చేరుకున్న రియాజ్, రద్దీగా ఉన్న బస్సు ఎక్కే ప్రయత్నంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో విద్యార్థి తలకు గాయమై రక్తస్రావం కావడంతో వెంటనే స్పందించిన పోలీసులు ఆటోలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

కాగా, ప్రతిరోజూ పాఠశాలలు ముగిసే సమయంలో బస్టాండ్‌లో విద్యార్థుల రద్దీ పెరుగుతున్నా సరిపడా బస్సులు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు నిలపకుండా వెళ్లడం, విద్యార్థులు పూర్తిగా ఎక్కకముందే ముందుకు కదలడం వంటి ఘటనలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పాఠశాలల వేళల్లో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు సురక్షితంగా బస్సులు ఎక్కి దిగేలా డ్రైవర్లు, కండక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు.

పత్తికి క్వింటాల్‌కు రూ.9,500 మద్దతు ధర ఇవ్వాలి

• కౌలు రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి: గొల్లపల్లి జయరాజు



సదాశివపేట, నవంబర్ 5 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున క్వింటాల్ పత్తికి రూ.9,500 మద్దతు ధర చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో సదాశివపేట పరిధిలోని పత్తి పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో పత్తి పంట దెబ్బతిని ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదన్నారు. రైతులకు పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, వారికి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని కోరారు. సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాలకు కరువు నిధులు కేటాయించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతు సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో నిర్వహించే రైతు సంఘం అఖిల భారత 36వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూషణం, ఏషబు, బుచ్చయ్య, శివయ్య, రైతులు పాల్గొన్నారు.

నేటి దూడలే రేపటి పాడిపశువులు

• దూడల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: డాక్టర్ మోనిక



అల్లాదుర్గం, నవంబర్ 5 (జనంసాక్షి): నేటి దూడలే రేపటి పాడి పశువులని, వాటి పోషణ, పెంపకంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధి కారిణి డాక్టర్ మోనిక సూచిం చారు. గురువారం అప్పాజీపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భస్థ, సాధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

నాణ్యమైన దూడల కోసం కృత్రిమ గర్భధారణ చేయించాలని, పుట్టిన దూడలకు నట్టల నివారణ మందులు, కాలానుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పశుగ్రాసం సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాలమిత్రులు, పాడి రైతులు పాల్గొన్నారు.

మెదక్‌ను

సంపూర్ణ కరువు జిల్లాగా ప్రకటించాలి

• రూ.10 వేల కోట్ల కరువు నివారణ నిధులు కేటాయించాలి: సీపీఎం



కొల్చారం, నవంబర్ 5 (జనంసాక్షి): మెదక్ జిల్లాను సంపూర్ణ కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణ చర్యలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కోశాధికారి నరసమ్మ డిమాండ్ చేశారు. గురువారం కొల్చారం మండల తహసీల్దార్ శ్రీనివాస్ చారికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 90 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ కేవలం మనోహరాబాద్ మండలాన్నే కరువు మండలంగా ప్రకటించడం సరికాదన్నారు. జిల్లాలో సాగవుతున్న పంటల విస్తీర్ణంపై వ్యవసాయ అధికారులు స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిష్టయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడిని

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



కల్హేర్, నవంబర్ 05(జనంసాక్షి): కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన జనుముల సాయిలు కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న ఆయన కుమారుడిని మాజీ ఎమ్మెల్యే మహీరెడ్డి భూపాల్ రెడ్డి గురువారం పరామర్శించారు.

ఈ సందర్భంగా బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. ప్రమాదం జరిగిన తీరు, ఆసుపత్రిలో అందిన చికిత్స, ప్రస్తుతం తీసుకుంటున్న మందుల గురించి కుటుంబ సభ్యులను ఆరా తీశారు. ఆపద సమయంలో అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. కుటుంబానికి మనోధైర్యం నింపారు. గ్రామంలో ఏ కుటుంబానికి కష్టం వచ్చినా వెంటనే స్పందించి పరామర్శించడం తన బాధ్యతగా భావిస్తానని ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుంటానని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అలీ, మాజీ సర్పంచ్ పండరి, మాజీ ఎంఏటీసీ శ్రీనివాస్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాములు, పీరయ్య, అబ్రహం, సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యమకారుడు

లక్ష్మణ్ గౌడ్ మృతికి కొవ్వొత్తులతో నివాళి



బెజ్జంకి, నవంబర్ 5 (జనంసాక్షి): తెలంగాణ ఉద్యమకారుడు, బచ్చన్నపేట పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య మృతికి సంతాపంగా గురువారం బెజ్జంకి మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం మండల అధ్యక్షుడు మ్యాకల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఉద్యమకారుల త్యాగాలు వెలకట్టలేనివని, ప్రభుత్వం వారి త్యాగాలను గుర్తించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మణ్ గౌడ్ మృతి ఉద్యమకారులకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడే 'శ్రీ వ్యాస తత్వజ్ఞ తీర్థుల వారి చరిత్ర' పుస్తకావిష్కరణ



గద్వాల నడిగడ్డ, నవంబర్ 5 (జనంసాక్షి): ప్రాచీన పుణ్యక్షేత్రాల చరిత్రను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన 'శ్రీ వ్యాస తత్వజ్ఞ తీర్థుల వారి చరిత్ర' తెలుగు పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గద్వాల కోటలోని చారిత్రక చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కోనాపూర్ మోహన్ రావు తెలిపారు. మంత్రాలయ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు. గతంలో కన్నడలో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ గ్రంథాన్ని రాఘవేంద్ర మెట్పల్లి సహకారంతో తెలుగులోకి అనువదించి ముద్రించినట్లు పేర్కొన్నారు. భక్తులు, తెలుగు ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఆపదలో ఉన్న కార్యకర్తకు అండగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



గోపాలపేట, నవంబర్ 5 (జనంసాక్షి): ఏదుల మండలం చెన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు ఎండీ సత్తార్ అనారోగ్యంతో వనపర్తిలోని ఎస్వీ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎండీ సత్తార్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. సత్తార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట అబ్దుల్ మహమూద్, అస్లాం, ఆరిఫ్, అలీం, జమీల్, యూసుఫ్, చిట్యాల రాము, మంద రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులకు

ఎమ్మెల్సీ పదవి కేటాయించాలి

• నీలం మధు ముదిరాజ్‌కు అవకాశం కల్పించాలి: రవి ముదిరాజ్



కోహిర్, నవంబర్ 5 (జనంసాక్షి): రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్‌కు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జహీరాబాద్ ఇన్‌చార్జి రవి ముదిరాజ్ (ఎన్ఎంఆర్) కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు నీలం మధు ముదిరాజ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ప్రజా సమస్యలపై పోరాడుతూ, ముదిరాజ్ సామాజిక వర్గ హక్కులను గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినిపించారని పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పేదలకు అండగా నిలుస్తూ, యువతకు ఆదర్శంగా ఉన్నారని కొనియాడారు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి జనాభా పరంగా తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈ వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

నీలం మధుకు అవకాశం కల్పించి ముదిరాజ్ సమాజానికి రాజకీయ గుర్తింపు, సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు.

నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

• పది రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవనంలోని వివిధ విభాగాలు, ఛాంబర్లు, సమావేశ మందిరాలు, ఇతర మౌలిక సదుపాయాల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ ఛాంబర్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సమావేశ మందిరాల్లో జరుగుతున్న ఫర్నిచర్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఫర్నిచర్ నాణ్యత, అమరిక, ఇంటీరియర్ పనుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. పెండింగ్ పనులను జాప్యం లేకుండా పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సౌండ్ సిస్టమ్ స్పష్టమైన శబ్ద నాణ్యతతో పనిచేసేలా చూడాలని, ఆధునిక సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వెంకట రమణయ్యను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను సైతం నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలని, అన్ని విభాగాల్లో విద్యుత్, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.



పది రోజుల్లో చివరి దశ పనులన్నీ పూర్తి చేసి నూతన కలెక్టరేట్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధంచేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత గడువులో భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్డీఓ వెంకట్ రాములు, కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్, సీపీఓ రాఘవాహన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ రాములు, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి కొయ్య

కాళ్ళను కాల్చవద్దు.. ఏఓ.నెలవంక

అల్లాదుర్గం, నవంబర్ 5 (జనంసాక్షి): వానాకాలంలో వరి సాగు చేసిన రైతు సోదరులు పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన వరి కొయ్యకాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చవద్దని జిల్లా వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నెలవంక అన్నారు.

వరి కొయ్యకాళ్లను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు పశువులు, ఇతర జీవులకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉంది. అంతేకాకుండా భూమిలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి, నేలలో సేంద్రియ పదార్థం తగ్గి భూసారం దెబ్బతింటున్నారు. వరి కొయ్యకాళ్లను కాల్చకుండా భూమిలోనే కలియదున్నడం ద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవచ్చు. ఇందుకోసం ఎకరాకు 100 కిలోల (సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) చల్లి, నీరు పెట్టి, అనంతరం కొయ్యకాళ్లను భూమిలో కలిసేలా కలియదున్నాలి. దీనివల్ల వరి కొయ్యకాళ్లు కుళ్లి భూమిలో సేంద్రియ పదార్థం పెరగడానికి, నేల ఆరోగ్యం మెరుగుపడటానికి దోహదపడతాయన్నారు.

కావున రైతులందరూ పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడేందుకు వరి కొయ్యకాళ్లను కాల్చకుండా వ్యవసాయ శాఖ సూచించిన పద్ధతులను పాటించాలని కోరారు.

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

• చౌదర్‌పల్లి సర్పంచ్ సురేందర్



రేగోడ్, నవంబర్ 05 (జనంసాక్షి): రైతులు ధాన్యాన్ని దళారుల వద్ద అమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయించాలని మెదక్ జిల్లా రేగోడు మండల పరిధిలోని చౌదర్‌పల్లి సర్పంచ్ సురేందర్ పేర్కొన్నారు. గురువారం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సురేందర్ తహసిల్దార్ దత్తారెడ్డితో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రతి ఒక్క రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరనప్ప, ఐకెపి వివో శిరీష, పీసీసీ సభ్యుడు కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దిగంబరావ్ తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పుల్కల్, నవంబర్ 5 (జనంసాక్షి): మండల కేంద్రం పుల్కల్ లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డీసీఎంఎస్ నిర్వాహకులు బోయని దామోదర్, గ్రామ రైతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ఘనంగా పీటీఎం



ముత్తల్, నవంబర్ 5 (జనంసాక్షి): మంతన్ గోడ్ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పీటీఎంలో 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా హెచ్ఎం పరమేశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవం, నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యమన్నారు. పాఠశాల అభివృద్ధిలో తల్లి దండ్రుల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. ఎస్ఏ-1 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సుజాత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాబాలమని చెప్పి దొంగతనం చేస్తున్నారు జాగ్రత్త CI కంట్టి



నిజాంపేట్, నవంబర్ 05 (జనంసాక్షి): నిజాంపేట్ మండల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని పక్క మండలాల్లో బాబాలమంటూ గ్రామాల్లో తిరుగుతూ పూజలు చేస్తామని మాయమాటలు చెప్పి దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంట్టి CI వెంకట్ రెడ్డి హెచ్చరించారు.మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి ఆటోలలో వచ్చి, వాటి చుట్టూ దేవి ఫోటోలు పెట్టుకొని గ్రామాల్లో తిరుగుతూమీ ఇంట్లో దోషం ఉంది, పూజ చేసి తీసేస్తాం అని డబ్బులు ఇవ్వండి అని అడుగుతున్నారన్నారు. ఒకరి ఇంట్లోకి వెళ్లి మీ ఇంట్లో దోషం ఉంది, పూజ చేయాలి డబ్బులు, బంగారం తీసుకొచ్చి పెట్టండి అని మాయమాటలు చెప్పి, ఉన్న వాటితో పారిపోతున్నారని తెలిపారు.

ఉజలంపాడులో ఘటన నిన్న సిర్గాపూర్ మండలంలోని ఉజలంపాడు గ్రామంలోకి కొంతమంది బాబాలమంటూ వెళ్లి, ఒక ఇంటికి వెళ్లి ఆ ఇంటి మహిళతో నీకు దోషం ఉందని, పూజ జరిపించాలని మాయమాటలు చెప్పి మోసం చేసి, ఆమె దగ్గర ఉన్న 9 గ్రాముల బంగారం మరియు 45 వేల రూపాయలు తీసుకొని పారిపోయినట్లు తెలిపారు.ఇలాంటివి నమ్మొద్దని, ఎవరైనా వచ్చి ఇలా చేస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని, బాబాల ముసుగులో దొంగతనం చేయడానికి గ్రామాల్లోకి వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆత్మకూర్, నవంబర్ 5 (జనంసాక్షి): ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. రాజు డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా ఆత్మకూర్ మండలంలోని బస్తీ దవాఖాన వద్ద మెడికల్ ఆఫీసర్ ఫయాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శాంతమ్మ, శ్రీదేవి, నిర్మల, సునీత, అనసూయ, అంజలి, పుష్ప, సుశీల పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించిన సైకాలజిస్ట్ రాధాకృష్ణారావు



కృష్ణ, నవంబర్ 5 (జనంసాక్షి): పీఎంశ్రీ, జెడ్పీ హై స్కూల్ లో కున్సిలో నిర్వహించిన ఎక్స్పర్ట్ టాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రముఖ సైకాలజి స్ట్, బి.ఎడ్. కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రాధాకృష్ణారావు విద్యార్థులకు విలువైన మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించే మార్గాలు, సమయపాలన, లక్ష్యసా ధన వంటి అంశాలపై చక్కని అవగాహన కల్పిం చారు.ప్రముఖ వ్యక్తుల జీవితాల్లోని ఆసక్తికర సంఘటనలను ఉదాహర ణలుగా వివరిస్తూ విద్యార్థు ల్లో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించారు.“మన జీవితాలను మార్చే శక్తి చదువుకు మాత్రమే ఉంది. ప్రపంచంలో అత్యంత విలువైన సంపద సమయం. ఒక్కసారి చేజారిన సమయం తిరిగి రాదు. కాబట్టి ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుం టూ లక్ష్యం వైపు అడుగు లు వేయాలి” అని విద్యార్థులకు ఉద్బోధిం చారు.ఆయన ప్రసంగం విద్యార్థుల్లో కొత్త ఆలోచన లకు, కొత్త ఆశలకు, ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తిని చ్చింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు శ్రీమతి బి. సంతోషి , ఉపాధ్యాయ బృందం పి. నరేందర్, ఉష, ఖాసీం అలీ, సౌమ్య, నర్సిములు, సత్యనారా యణ రెడ్డి, స్వాతి, గీత, ఆరీఫ్, రాధిక, స్మిత, నగేష్, కృష్ణవేణి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం



చేర్యాల, నవంబర్ 5 (జనంసాక్షి): వీబీజీ రాంజీ పథకంలో భాగంగా ఆకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను సర్పంచ్ కొమ్ము రవి గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. మురుగునీటి వృథాను అరికట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు దోహదపడతాయని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకుని నీటి సంరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన గీతా విద్యార్థిని



తూప్రాన్ నవంబర్ 5(జనంసాక్షి): తూప్రాన్ గీతా స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని కే. నవ్యశ్రీ 32 వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ మెదక్ జిల్లా స్థాయి సెమినార్ లో అద్భుత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ రామాంజనేయులు తెలిపారు.

నవంబర్ 4వ తేది బుధవారం నాడు మెదక్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సెమినార్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ను జల సముదాయంలో కరిగించి, శుద్ధిచేసే రసాయన పద్ధతిని చక్కగా వివరించినందుకు జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్మన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, భరత్, డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ అరుణ, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, సైన్స్ ఉపాధ్యాయులు నవ్యను అభినందించారు.

న్యాల్‌కల్ కస్తూర్బాకు అరుదైన గౌరవం

• కమిషనర్ చేతుల మీదుగా ఎస్ఓ, పీఈటీకి ప్రశంసా పత్రాలు



న్యాల్‌కల్, నవంబర్ 5 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ కస్తూర్బా గురుకుల పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు చెందిన సావిత్రి, పూజ, మీరాబాయి, సౌమ్యలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో అదనపు కమిషనర్ శ్రీహరి చేతుల మీదుగా పాఠశాల ప్రత్యేక అధికారిణి లలిత, పీఈటీ భూమిక ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విద్యార్థినుల ప్రతిభను గుర్తించి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రశంసించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఈ నలుగురు బాలికలు వివిధ జిల్లాల క్రీడాకారులతో తలపడనున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

• మల్లేపల్లిలో ఇంట్లో ఉరివేసుకుని మృతి



సంగారెడ్డి, నవంబర్ 5 (జనంసాక్షి): కుటుంబ కలహాల నేపథ్యంలో కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన బోయిని నాగరాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం నాగరాజుకు భార్య సుజాతతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోగా, 20 రోజుల క్రితం కుటుంబ సభ్యులు నచ్చజెప్పి తిరిగి తీసుకువచ్చారు. అయినప్పటికీ వారి మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. మృతుడి తండ్రి రామచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరి తెలిపారు.

ఖేత్ బచావో అవగాహన

• మహిళ సంఘాలకు వేరుశెనగ పంపిణీ



మద్దికల్, నవంబర్ 5 (జనంసాక్షి): మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఖేత్ బచావో భాగంగా గురువారంరైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.రైతులకు వేరుశెనగ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జగ్గునాయక్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అధిక నీటి అవసరం కలిగిన వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జొన్న, ఉలవలు,అలసందలు మరియు వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.భూసార పరిరక్షణ కోరకు పశువుల పేడనీ వాడి రసాయన ఎరువు వాడకాన్ని తగ్గించగలరని తెలిపారు.

వాతావరణ మార్పులను తట్టుకునే పంటల విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జగ్గునాయక్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్,గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, ఏపిఎం భీమసేన్ నాయుడు,సీసీలు రామకృష్ణ జయరాజు, భాష,ఏఈ ఓసురేష్ గౌడ్,రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన

• సీనియర్ సివిల్ జడ్జి దీప కాసరగడ్డ



వనపర్తి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమాజంలో ఎదురవుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి దీప కాసరగడ్డ సూచించారు.గురువారం వనపర్తి జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నవంబర్ 11న నిర్వహించే జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఫొటో మార్ఫింగ్, ఆన్‌లైన్ వేధింపులు, మానవ అక్రమ రవాణా వంటి సైబర్ నేరాలు, ఇతర నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం.చారు. సైబర్ దాడులు, బాల్య వివాహాలు, మోటారు వాహనాల చట్టం, సోషల్ మీడియా యాప్‌ల పరిమిత వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే ఆర్థిక స్థోమత లేని వారు సైతం న్యాయ సహాయం పొందవచ్చని, ఉచిత న్యాయ సేవల కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం. రఘు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ షరా, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



పిడమర్తి రవికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

• మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కర్రె రమేష్



రామాయంపేట, నవంబర్ 5 (జనంసాక్షి): తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ పిడమర్తి రవికి త్వరలో భర్తీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానంలో అవకాశం కల్పించాలని మాదిగ జేఏసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు కర్రె రమేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపకుడిగా తెలంగాణ ఉద్యమంలో పిడమర్తి రవి కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర సాధనతో పాటు ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలోనూ పోరాడారని పేర్కొన్నారు. ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ద్వారా మాదిగ సామాజిక వర్గానికి చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు గంగాపురం సంజీవులు, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

సర్వలోక రక్షకుడు ఏసు...



సంగారెడ్డి, నవంబర్ 5 (జనంసాక్షి): దేవుడే మానవుని సృష్టించాడు కనుక మానవులంతా దేవుడి పిల్లలు. మానవులకు తండ్రి ఏసుక్రీస్తే దేవుడు తన పిల్లలైన మానవులు పాపంలో నశించి చెడి పోవడం చూడలేక పాపంనుంచి నరకం నుంచి రక్షించే సర్వలోక రక్షకుడు ఏసు క్రీస్తు అని డివైన్ ప్లేస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ బి ఏలియా పాస్టర్ బి. బోయాజు, ఎస్ ఐ చర్చి సంగారెడ్డి వాక్యోపదేశకులు పాస్టర్ ఏ. మోజేష్ శాస్త్రి పేర్కొన్నారు. సంగారెడ్డిలో మూడు రోజులపాటు డివైన్ గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సిఎస్ఐ చర్చి లో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైనారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



ప్రతిఒక్కరూ నిజమైన దేవుని గ్రహించి మంచి మార్గంలో పయనించి పరలోకానికి మార్గం సుగమం చేసుకోవాలి. ఇరుగు పొరుగు వారిని ప్రేమించి శత్రువులను సైతం క్షమించగల దయాగుణం కలిగి ఉండాలని సూచించాలి. అప్పుడే దేవుని త్యాగానికి ప్రతిఫలం ఉంటుందన్నారు. బైబిల్ గూర్చి అవగాహన ప్రతి క్రైస్తవుడికి ఉండాలని, బైబిల్ 66 పుస్తకాలు కలిగి రెండు భాగాలుగా విభాగింపబడి ఉన్నది అని ఆయన అన్నారు.

భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణం

సదాశివపేట, నవంబర్ 5(జనంసాక్షి): వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు మిలిగిరి పేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, ప్రభుత్వ పాఠశాల ఆవరణ, పంచాయతీ కార్యాలయం, బోరుబావుల సమీపంలో వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నారు.



ఈ సందర్భంగా సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద, ప్రతి వీధిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాలను పెంచాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

సిర్గాపూర్‌లో శబరిమలకు పాదయాత్ర

• 12వ సారి అయ్యప్ప దీక్షతో శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు



సిర్గాపూర్, నవంబర్ 5 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన విరల్ అయ్యప్ప గురుస్వామి, 12వసారి వినోద్ స్వామి, అయ్యప్ప దీక్ష చేపట్టి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. వినయ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర కొనసాగగా, పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొని స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో **"స్వామియే శరణం అయ్యప్ప"** నామ స్మరణతో యాత్ర కొనసాగింది.గ్రామస్తులు, భక్తులు పాదయాత్రకు బయలుదేరిన స్వాములకు శుభాకాంక్షలు తెలిపి, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

పదో తరగతి విద్యార్థులకు 140 రోజులే సమయం



మద్దికల్, నవంబర్ 5 (జనంసాక్షి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎస్ఏ-1 పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సురేష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు సుమారు 140 రోజుల సమయం మాత్రమే ఉందని, ప్రతిరోజూ పాఠశాలకు హాజరవుతూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



కల్వకుర్తి, నవంబర్ 5 (జనంసాక్షి): పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీపురం హరీష్‌రెడ్డిని వెంకటాపూర్ కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అయితపగ సంతోష్ కుమార్, శంకర్, సురేష్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పు.. నీటి పొదుపే రైతులకు శ్రీరామరక్ష!

- నీటి కొరతను అధిగమించేందుకు సూక్ష్మ సేద్యమే మార్గం
- బిందు, తుంపర సేద్యంతో రైతుకు లాభాలు
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి పి.సోమేశ్వరరావు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి):
ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి లభ్యత తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ఇప్పటి నుంచే నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి పి.సోమేశ్వరరావు సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని పిలుపునిచ్చారు.
బుధవారం కోహీర్, జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లోని రైతుల పొలాలను ఆయన సందర్శించి, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బిందు, తుంపర సేద్య పరికరాల





పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిందు, తుంపర సేద్య పద్ధతుల ద్వారా పంటలకు అవసరమైన నీటిని సరైన సమయంలో, తగిన పరిమాణంలో అందించవచ్చని తెలిపారు. దీనివల్ల నీటి వృథాను అరికట్టడంతో పాటు తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితుల్లో ఈ పద్ధతులు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి రైతు నీటి పొదుపు చర్యలు చేపడుతూ, ఆధునిక సాగు పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు.
క్షేత్రస్థాయిలో రైతులు సూక్ష్మ సేద్య పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఈపీసీ మహీంద్ర ఇరిగేషన్ డీసీఓ జైపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో
రూ.1.02 లక్షల నగదు చోరీ



గద్వాల, నవంబర్ 5 (జనంసాక్షి): గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న సయ్యద్ కార్పెంటర్ వర్క్ షాప్‌లో పట్టపగలే రూ.1,02,500 నగదు చోరీకి గురైంది. కస్టమర్ ఇచ్చిన అడ్వాన్స్ నగదును ప్యాంట్ జేబులో పెట్టి గోడకు తగిలించిన సయ్యద్, పని నిమిత్తం బయటకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి షాపులోకి చొరబడి నగదుతో పరారయ్యాడు. ఈ ఘటన సీసీటీవీలో రికార్డైంది. బాధితుడి ఫిర్యాదుతో గద్వాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసు లకు సమాచారం అందించాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- బాలలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తాం: బి.సౌజన్య

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి):
బాలల హక్కుల పరిరక్షణ, సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి బాలుడికి విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవప్రదమైన జీవితం పొందే హక్కు ఉందన్నారు. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, వేధింపులు, వివక్షను అరికట్టేందుకు సమాజం బాధ్యతగా వ్యవహ



రించాలని సూచించారు. చట్టంతో సంఘర్షణలో ఉన్న బాలలను నేరస్థులుగా చూడకుండా కౌన్సెలింగ్, పునరావాసం, విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులైన బాలలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయవాదుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కె.ధనలక్ష్మి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుడు వాసుదేవ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది నిజాముద్దీన్, జె. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

- సమిష్టి కృషితో సమస్యలను పరిష్కరించాలి: జి.అంజయ్య

రాయికోడ్, నవంబర్ 5 (జనంసాక్షి):
మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, సర్పంచులు సమన్వయంతో పని చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య సూచించారు. గురువారం రాయికోడ్ ఎంపీపీ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి జగదీశ్వర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.





ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పశువులకు పశుగ్రాస కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలంలో రూ.600 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. చిమ్నాపూర్ చౌరస్తాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని ఎంఈఓ నర్సింలు కోరారు.
రాయికోడ్‌ను కరువు మండలంగా ప్రకటించిన ప్రభుత్వానికి సభ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల
నివారణ మందులు, చర్మవ్యాధి టీకాలు

- పశువులకు నట్టల నివారణ కార్యక్రమం
- రంగంపేట సెక్టార్ పశు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక వాసు

కొల్చారం, నవంబర్ 05 (జనంసాక్షి):
మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని యనగండ్ల, కిష్టాపూర్ గ్రామాల్లో పశువులకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగంపేట సెక్టార్ పశువైద్యాధికారి డాక్టర్ ప్రియాంక వాస్ ఆధ్వర్యంలో ఆవులు, దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులతో పాటు చర్మవ్యాధి నివారణ టీకాలను అందించారు.



ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక వాస్ మాట్లాడుతూ.. పశువులకు సకాలంలో నట్టల నివారణ మందులు, చర్మవ్యాధి నివారణ టీకాలు వేయించడం ద్వారా వివిధ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. రైతులు ప్రభుత్వం చేపడుతున్న పశువైద్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పశుసంపదతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, ప్రభాకర్, మానయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్ పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

- గ్రంథాలయ చైర్మన్ జి.అంజయ్య

రాయికోడు, నవంబర్ 5 (జనంసాక్షి):
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య ఖండించారు.






గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ మంత్రి దామోదర్ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ సృష్టికర్త అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరు దామోదర రాజ నరసింహ పేరును గుర్తు చేస్తారని తెలిపారు. ఆరు దశాబ్దాలుగా రాజనర్సింహ కుటుంబం అందోల్ నియోజకవర్గానికి, కాంగ్రెస్ పార్టీకి, సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అప్పటి యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీకి, అప్పటి కేంద్ర క్యాబినెట్ ఏర్పాటు చేసిన జీవోఎం ముందు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు విషయంలో సబ్జెక్టు వైస్‌గా నివేదించిన వ్యక్తి దామోదర్ రాజనర్సింహ యని కొనియాడారు.
మంత్రి దామోదర్ ఆందోల్ నియోజకవర్గంలో 3వెల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.
సంగుపేట నుండి జోగిపేట వరకు ఎడ్యుకేషన్ హబ్‌గా మంత్రి తీర్చిదిద్దారని గుర్తుచేశారు. మంత్రి దామోదర్ సహకారంతో రాయికోడు మండలంలో 600 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. దామోదర్ రాజనర్సింహ అంటే అభివృద్ధి ప్రదాత అని మచ్చలేని నాయకుడని తెలిపారు. అలాంటి నాయకుని పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్ తదితరులు ఉన్నారు.

నూతన వధూవరులకు శశికళ రెడ్డి ఆశీస్సులు

జహీరాబాద్, నవంబర్ 5 (జనంసాక్షి):
పట్టణంలోని 9వ వార్డుకు చెందిన కావలి వెంకటయ్య-నాగమణి దంపతుల కుమార్తె వనజ వివాహం రవితేజతో గురువారం చెన్నారెడ్డి గార్డెన్‌లో జరిగింది. వేడుకకు హాజరైన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తల్లి శశికళ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

ఎర్రవల్లి, నవంబర్ 5 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున వరికి బదులుగా పప్పుదినుసులు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతు విజ్ఞాన కేంద్రం జిల్లా సమన్వయకర్త అర్చన సూచించారు. గురువారం తిమ్మాపూర్, బీచుపల్లి, ఎర్రవల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో సాగు పరిస్థితులపై చర్చించారు.
ఎఫ్‌పీఓ సభ్యత్వ ప్రయోజనాలు, సామూహిక మార్కెటింగ్, సాంకేతిక సలహాలపై అవగాహన కల్పించారు. వేరుశనగ పంట పూత దశలో ఎకరాకు 200 కిలోల జిప్సం, 10 కిలోల యూరియా వేయాలని సూచించారు. తేమలేక సుమారు 635 ఎకరాల్లో వరి పంట



ఎండిపోయినట్లు రైతులు తెలిపారు. పర్యటనలో మండల వ్యవసాయ అధికారి సురేష్ పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన మాగనూర్ జర్నలిస్టులు

మాగనూర్, నవంబర్ 5 (జనంసాక్షి): మాగనూర్ మండల జర్నలిస్టులు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని గురువారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన పుంజనూర్ సురేష్‌ను మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ చిరకాల స్వప్నమైన ఇంటి స్థలాలను కేటాయించాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి గతంలోనూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించానని, ప్రస్తుతం అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో జర్నలిస్టులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రసవం తర్వాత వివాహిత మృతి

- **గజ్వేల్ ఆర్‌వీఆర్ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన**
- **వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణ..**
- **బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్**



మర్కుక్, (జనంసాక్షి): ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గజ్వేల్‌లో విషాదాన్ని నింపింది. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుటుంబ సభ్యురాలి మృతికి కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రానికి చెందిన కల్పన నాలుగు రోజుల క్రితం గజ్వేల్‌లోని ఆర్‌వీఆర్ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సిజేరియన్ ఆపరేషన్ సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని వెల్నెస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం కల్పన మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన



కుటుంబ సభ్యులు ఆర్‌వీఆర్ ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే కల్పన మృతి చెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఏసీపీ నర్సింలు, పోలీసులు, ప్రత్యేక బలగాలు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు.
అయితే బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి నిరసన కొనసాగించారు. చివరకు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం సాయంత్రం హాస్పిటల్ ముందు బాధిత కుటుంబ సభ్యులు అగ్గి పెట్టి నిరసన వ్యక్తం చేసారు.

ఎన్నికలపై విద్యార్థులకు వ్యాస, క్విజ్ పోటీలు

- **నవంబర్ 20లోగా మూడు స్థాయిల్లో ఈ పోటీలు: అదనపు కలెక్టర్ సంగీత**

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి): భవిష్యత్ ఓటర్లలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ సంగీత తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ నిర్వహించిన వీడియో సమావేశంలో ఆమె పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నవంబర్ 2 నుంచి 20 వరకు మూడు స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత విద్యాసంస్థల స్థాయిలో నవంబర్ 2 నుంచి 7 వరకు, నియోజకవర్గ స్థాయిలో నవంబర్ 10 నుంచి 13 వరకు, జిల్లా స్థాయిలో నవంబర్ 16 నుంచి 18 వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. విద్యాసంస్థల స్థాయిలో ప్రతి పోటీలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తారని, అక్కడ ప్రతిభ చూపిన పది మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు.
వ్యాసరచన పోటీలకు 'ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యత', 'శుద్ధమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యత' అనే అంశాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో వ్యాసాలు రాయవచ్చని తెలిపారు. ప్రతి స్థాయిలో విజేతల ఎంపికకు ప్రత్యేక



కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా స్థాయి విజేతల వివరాలతో సమగ్ర నివేదికను నవంబర్ 25లోగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. పోటీల విజయవంతమైన నిర్వహణకు స్వీప్ నోడల్ అధికారి సమన్వయంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు

- **షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన**



చేర్యాల, నవంబర్ 05 (జనంసాక్షి): చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు, షీ టీమ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగాచేర్యాల ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మహిళల భద్రత, రక్షణ కోసం షీ టీమ్స్ పనితీరు, ఫిర్యాదు చేసే విధానం, 100 డయల్, డయల్ ఫర్ షీ టీమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యాలయ సిబ్బంది, మహిళా ఉద్యోగులకు చట్టాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

వాచ్‌మెన్ కుటుంబానికి రూ.1.05 లక్షల ఆర్థిక సాయం



కోహెడ, నవంబర్ 5 (జనంసాక్షి): పాముకాటుతో మృతిచెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వాచ్‌మెన్ మార్క రాజమౌళి కుటుంబానికి ఉపాధ్యాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యార్థుల తల్లిదండ్రులు రూ.1,05,000 ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆయన కుమార్తె సాత్విక పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, భార్య జ్యోతికి డిపాజిట్ బాండ్ అందజేశారు. చిన్నారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఎం. ఉదయ్ కుమార్ రెడ్డి, నరసింహాచారి, మాజీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోవాలి



వెల్దండ, నవంబర్ 5 (జనంసాక్షి): పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని 9వ వార్డు సభ్యుడు ముదిగొండ రమేష్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్తిక్ కుమార్‌ను కలిసి బీఎల్ఓ ఫారం అందజేశారు. కార్యక్రమంలో 11వ వార్డు సభ్యులు బాదేపల్లి రమేష్, బడుక రామకృష్ణ, మారేపల్లి లోకేష్, గంటల శ్రీకాంత్,అన్నేపు ప్రశాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

- **13వ వార్డులో రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు**
- **34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం**

సంగారెడ్డి, నవంబర్ 05 (జనంసాక్షి): సంగారెడ్డి పట్టణంలోని 13, 34వ వార్డుల్లో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, గురువారం ప్రారంభించారు.
పట్టణంలోని 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.
ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన



వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ, కౌన్సిలర్లు వీణా కిరణ్, అన్వర్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, అడ్డూ, మున్నా, రాజు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

- **చెరుకూరు సర్పంచ్ - బచ్చలకూర శ్రీనివాసులు**



వెల్దండ, నవంబర్ 05 (జనంసాక్షి): వెల్దండ మండలంలోని పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని చెరుకూరు గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు అన్నారు. పట్టబద్రులంతా తమ ఓటుతోనే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని, బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.గురువారం ఓటు నమోదు చేసుకున్న బీఎల్ఓ డిక్లరేషన్ పత్రాలను ఎమ్మార్వో భీష్వ కార్తీక్ కుమార్ కు అందజేశారు.పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెంటనే నమోదు చేసుకోవాలని, గడువు ముగిసేలోపు ఎవరూ మిగిలిపోకుండా చూడాలని ఆయన కోరారు. యువత, పట్టభద్రులు తమ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, ఉపసర్పంచ్ కొండలు, మాదిగల ఐక్యవేదిక అధ్యక్షులు దూళ్ళ సామేల్,వార్డు సభ్యులు పురుగుల లాలయ్య,మీసాల రాజు, జంగయ్య, రామచంద్రయ్య,రమేష్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి 'పాంచజన్యం' లక్ష్యాలు!



గద్వాల, నవంబర్ 5 (జనంసాక్షి): తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రకటించిన 'పాంచజన్యం' ఆశయాలను, ఆకాంక్షలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. గద్వాల నియోజకవర్గంలో ముస్లిం, మైనార్టీ వర్గాలను చైతన్యపరుస్తూ పార్టీ శ్రేణులు సమరశంఖం పూరించాయి.టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కార్యాలయంలో జరిగిన ముస్లిం, మైనార్టీల కీలక సమావేశం ఇందుకు వేదికైంది. సమాజంలో అణచివేతకు గురవుతున్న ప్రతి ఒక్క వర్గానికి అండగా నిలవడమే ఈ పాంచజన్యం యొక్క అసలైన పరమార్థమని నాయకులు స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందించిన పిలుపు మేరకు ఉచిత నాణ్యమైన విద్య, కార్పొరేట్ స్థాయి వైద్యం, అడ్డంకులు లేని ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమ వ్యవసాయం, వివక్ష లేని సామాజిక న్యాయం అనే ఐదు సూత్రాల ఎజెండాను ప్రజల గుండెల్లోకి చేర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.మైనార్టీల సంపూర్ణ మద్దతుతో, మతం-కులం అనే తేడాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ అంతిమ విధానమని పార్టీ శ్రేణులు ప్రకటించాయి. గద్వాల గడ్డపై నుంచి ప్రారంభమైన ఈ చైతన్య యాత్ర, రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ చేరి, తెలంగాణ రక్షణ సేన ఆశయ సాధనకు గట్టి పునాది వేస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

ధాన్యం నిల్వకు గోదాముల వేట

- గతేడాది ధాన్యం నిల్వల అవకతవకలపై లోతైన చర్చ
- రైస్ మిల్లర్లతో అధికారులు చేసిన మంతనాలు విఫలం

హత్నూర, నవంబర్ 5 (జనంసాక్షి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులు గడుస్తున్నా కొనుగోలు కాంట ఇంకా కదలడం లేదు.పంటనూర్పి ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధం చేసుకున్న రైతులు దిక్కులు చూస్తున్నారు.కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కొనుగోలు కోసం ఎదురు చూస్తుంది. ఎల్ నినో దెబ్బకు పంటలు పాక్షికంగా ఎండిపోగా చేతికొచ్చిన ఆ కాస్త పంట ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.రైస్ మిల్లర్లతో అధికారులు జరుపుతున్న సుదీర్ఘ మంతనాలు ఎంతకీ ఓ కొలిక్కి రావడం లేదు.దీంతో కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుని నిరీక్షిస్తున్నారు.

ప్రారంభంలో శూరత్వం పనితనం శూన్యం...

మండలం వ్యాప్తంగా ఐకెపి -26, హత్నూర సొసైటీ -16,కాసాల సొసైటీ -3 మొత్తం 45 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రాలను ప్రారంభించడం లో చూపిన చురుకుదనం ధాన్యం కొనుగోలులో కనిపించడం లేదు.చేతికొచ్చిన పంటను కోసి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టి సిద్ధం చేసుకున్నారు.కొనుగోలు ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందోనని ఎదురు చూస్తున్నారు.

ధాన్యం నిల్వల అవకతవకలపై లోతైన చర్చ...

కొనుగోలు కేంద్రాల ద్వారా గతేడాది సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించగా 40 శాతం వడ్లను మాత్రమే మిల్లింగ్ చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి అందించారు.మిగిలిన 60 శాతం వడ్ల లెక్కలు ఎటూ తేలడం లేదు.ఇటీవల జరిగిన సోదాలో వరి ధాన్యం నిల్వల బాగోతం బయటపడింది.ప్రభుత్వానికి అందించాల్సిన వరి ధాన్యంలో కొంత ధాన్యాన్ని రైస్ మిల్లర్లు బియ్యంగా మార్చి గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు సంస్థలకు విక్రయించినట్లు లెక్కల్లో తేలింది. ధాన్యం నిల్వల్లో చోటు చేసుకున్న అవకతవకలపై సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు సమాచారం.

ధాన్యం నిల్వల కోసం గోదాముల వేట...

గతేడాది జరిగిన ధాన్యం నిల్వల అవకతవకలపై రైస్ మిల్లర్లతో జరిపిన చర్చలు విఫలం కావడంతో అధికారులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు గాకుండా ప్రైవేటు గోదాములకు తరలించాలని నిర్ణయించారు. అందుకు కావాల్సిన



గోదాములను గుర్తించడంలో అధికారులు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది.

అవకతవకలు భర్తీ చేసేందుకు పచ్చి వడ్లు కొనుగోలు...

గతేడాది ధాన్యం నిల్వల్లో చోటు చేసుకున్న అవకతవకలను భర్తీ చేసేందుకు రైస్ మిల్లర్లు పావులు కదుపుతున్నారు.అధికారులకు లెక్కలు అప్పజెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు. అందుకు కావాల్సిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేం దుకు నేరుగా రైతుల వద్దకు వెళ్తున్నారు.వ్యవసాయ క్షేత్రంలోనే పచ్చి వడ్లను కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం.

సింగిల్ విండో చైర్మన్ భూపతిరెడ్డికి ఘన సన్మానం



వెల్దండ, నవంబర్ 5 (జనంసాక్షి): వెల్దండ మండల సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికైన ఎన్నం భూపతిరెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు, వార్తా స్టాఫర్ బచ్చు రామకృష్ణ, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే సింగిల్ విండో డైరెక్టర్‌గా ఎన్నికైన కొయ్యల పుల్లయ్య ను కూడా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, గజిని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాడూరును కరువు మండలంగా ప్రకటించాలి



తాడూరు, నవంబర్ 6 (జనంసాక్షి): తాడూరు మండలాన్ని సంపూర్ణ కరువు మండలంగా ప్రకటించి, పంటలు నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అం దించాలని మండల అధ్యక్షు డు చీల సుదర్శన్ డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు చేతికందక అప్పులపాలవుతున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభు త్వం పట్టించుకోకపోతే కలెక్టరేట్‌ను పెద్ద ఎత్తున ముట్టడిస్తా మని హెచ్చరించారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



వెల్దండ, నవంబర్ 5 (జనంసాక్షి): మండలంలోని పట్టభద్రు లంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని చెరుకూరు సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు కోరారు. గురువారం ఓటరు నమోదు డిక్లరేషన్ పత్రాలను తహసీల్దార్ భీష్వ కార్తీక్ కుమార్‌కు అందజేశారు. గడువు ముగిసేలోపు అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండలు, మాదిగల ఐక్యవేదిక అధ్యక్షుడు దూళ్ళ సామేల్, వార్డు సభ్యులు పురుగుల లాల య్య, మీసాల రాజు, జంగయ్య, రామచంద్రయ్య, రమేష్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లటి దుస్తులు, బెలూన్లతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

- 24వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

నారాయణపేట, నవంబర్ 5 (జనంసాక్షి): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 24వ రోజుకు చేరుకున్నాయి.

ఈ సందర్భంగా ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నల్లటి దుస్తులు ధరించి, నల్లటి బెలూన్లను ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖ లో కీలక సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధా కరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ



లను అమలు చేసి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయా లని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి రాఘవేం దర్, సభ్యులు వినోద్, కిరీటి, తిరుపతి, రేణుక, శృతి, సౌందర్య, గాయత్రి, నవీన, సుమన, అనురాధ, మల్లికార్జున్, రామేశ్వరి, ముజీబ్, ఆశాజ్యోతి, సావిత్ర మ్మ, రామలింగమ్మ, నాగజ్యోతి, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిధుల వినియోగంలో స్పర్శ్ నిబంధనలు సరళీకరించాలి

టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు



- **చేర్యాల, నవంబర్ 5 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన గ్రాంట్ల వినియోగానికి తీసుకొచ్చిన స్పర్శ్ నిబంధనలను వెంటనే సరళీ కరించాలని టీఎస్ యూటీఎఫ్ చేర్యాల మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించినప్పటికీ, కొత్త నిబంధ నలతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీఎస్టీ పేరుతో దుకాణదారులు ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. బిల్లుల సమర్పణకు గడువు కూడా ఉన్నందున నిధుల వినియోగ ప్రక్రియను సులభతరం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలించిన ఏబివిపి నాయకులు

నారాయణపేట నవంబర్ 5(జనంసాక్షి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం మైనార్టీ గురుకుల పాఠ శాలను ఏబీవీపీ నారాయణపేట జిల్లా కన్వీనర్ సతీష్,నాయకులు పరిశీ లించారు. అక్కడ విద్యా ర్థులతోవారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటూ విద్యార్థ లు ఏ విధంగా ఉపాధ్యా



యులతో మెలగాలి, స్నేహితులతో ఎలా కలిసి మెలిసి ఉండాలి. కులమత వివేక్షిత లేకుండా అందరూ కూడా సోదర భావంతో మెలగాలి. దేశ అభివృద్ధి దిశ వైపు మనమందరం కూడా నడవాలి.. దేశ ఔన్నత్యాన్ని, దేశ ఐక్య తను, స్వదేశీ భావజాలం కలిగి ఉండాలని కోరారు. దేశ వ్యక్తిత్వం గురించి అలాగే ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై చేస్తున్న పోరా టాల గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. అలాగే అక్కడే మధ్యాహ్న భోజనంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యతమైన భోజనం మెనూ ప్రకారం భోజనం అందించడం చాలా మంచి అనిపించిం దని ప్రిన్సిపల్ ని అలాగే ఉపాధ్యాయులను అభి నందించారు. ఇలాంటి భోజనాన్ని విద్యను ఆ విద్యార్థులకు అందించి ప్రయోజకులుగా ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాల ని వాళ్లని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తరుణ్, భరత్, శివ మొదలగు కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రాగునీటి సరఫరాపై సమీక్ష

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



జడ్చర్ల, నవంబర్ 5 (జనంసాక్షి):

మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీటిని సరఫరా చేసేందుకు అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి మధుసూదన్ నాయక్, కమిషనర్ గిరీష్, ఏఈ గాయత్రితో కలిసి గురువారం వాటర్ ఫిట్టర్లు, లైన్‌మెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది స్పందిం చని పక్షంలో ప్రజలు నేరుగా మున్సిపల్ కమిషనర్ 73373 51867 లేదా ప్రత్యేక అధికారి 9989353554 లను సంప్రదించవచ్చని తెలిపారు. నిరంతర నీటి సరఫరాకు ప్రజ లు ఈ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు.

రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి



మద్దకల్, నవంబర్ 5 (జనంసాక్షి):

మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాసూచనలు సలహాల మేరకు గురువారం జిల్లా పారసంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభా వం వల్ల గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రైతులకు ఆరు తడి పంటలే వేయాలని తెలిపారు.నీటిని వృధా చేయకుండా ప్రతి నీటిబొట్టు వడిచిపెట్టి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, మూగజీవులకు పశువులు మేకలు, గొర్రెలు ఎద్దులు మూగ జంతువులు అయినటువంటి వాటికి గ్రామ పరిసర ప్రాంతాలలో పొలాల దగ్గర రైతుల నీల తొట్టిలను ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించారు. విద్యుత్‌లో పగటిపూట వినియోగించకుండా వెంటిలేటర్ లైట్లు ఆఫ్ చేసి ఓన్లీ రాత్రిపూట సమయాలలో ప్రజలు వినియోగించుకోవా లని టి.ఎస్ ఎస్ కళాకారులు గ్రామ ప్రజలకు రైతులకు తమ ఆటపాట మాటలతో చైతన్యపరిచారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామకృష్ణ,టిఎస్ ఎస్ కళాబృందం ఎండి హజరత్,రాహుల్, కేశవులు గ్రామ మహిళలు,రైతులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొనాయపల్లి దళితులపై దాడి చేసిన సర్పంచ్‌ను అరెస్ట్ చేయాలి

- 13 కిలోమీటర్ల పాదయాత్రతో డీఎస్పీ కార్యాలయం ముట్టడి
- నవంబర్ 10లోగా అరెస్ట్ చేయకుంటే కలెక్టరేట్ ఎదుట 48 గంటల దీక్ష





తూప్రాన్, నవంబర్ 5 (జనంసాక్షి): కొనాయపల్లి దళితులపై దాడికి పాల్పడిన గ్రామ సర్పంచ్ మన్నె కళ్యాణ్‌తో పాటు ఆయన అనుచరులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కొనాయపల్లి నుంచి తూప్రాన్ డీఎస్పీ కార్యాలయం వరకు 13 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, వీసీకే నాయకుడు తెలంగాణ శ్యామ్ మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారిని రాజకీయ ఒత్తిళ్లతో కాపాడే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దళితులను బెదిరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు విట్టల్ రెడ్డిపై కేసు నమోదు చేయాలన్నారు. జిల్లాలో దళితులపై దాడులు, కులవివక్ష ఘటనలు అరికట్టి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

కోనాయపల్లి, కిష్టాపూర్, కుచారం, నవాబుపేట, ఎదులపల్లి గ్రామాల్లో దళితులపై దాడులు, వివక్ష ఘటనలు చోటుచేసుకున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. బాధిత గ్రామాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటించి న్యాయం చేయాలని, కోనాయపల్లి కేసు విచారణ అధికారిగా ఉన్న డీఎస్పీని మార్చాలని, మనోహరాబాద్, శివ్వంపేట ఎస్సైలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 18న జరిగిన దాడుల కేసుల్లో నిందితులను ఇంకా అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. నవంబర్ 10లోగా నిందితులను అరెస్ట్ చేయకుంటే నవంబర్ 11, 12 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 48 గంటల నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. మండుటెండలో చిన్నారితో సహా పలువురు పాదయాత్రలో పాల్గొన్నారు.



డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ మాట్లాడుతూ... ఘటనకు సంబంధించి 12 మందిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేశామని, విచారణ వేగవంతం చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ. మహేందర్ రెడ్డి, నాగరాజు, బీఎస్పీ నాయకుడు కొమ్ము చంద్రం, డీబీఎఫ్ నాయకుడు పంచమి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై పోలీసుల విస్తృత తనిఖీలు

- వైన్ షాపులు, హోటళ్లలో తనిఖీలు..
- గంజాయికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచన



శ్రీరంగాపూర్, నవంబర్ 5 (జనంసాక్షి): మీ మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు డ్రగ్స్ నివారణ శాఖ ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్ హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్, ఎస్ఐ మన్యపు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు వైన్ షాపులు, హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని ప్రజలకు సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

గౌతాపూర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన..

- ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన!

బాలానగర్, నవంబర్ 5(జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని గౌతాపూర్ గ్రామంలో గురువారం ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు.

తదుపరి బాలానగర్ భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యం





లో నిర్వహించిన ఖాతాదారుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, ఖాతాలకు నామినీ వివరాలను నమోదు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న వివరాలను మరోసారి సరిచూసుకోవాలని సూచించారు. బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ ఇన్‌చార్జి రమేష్, గ్రామ సర్పంచి తాళ్ల ప్రకాష్ గౌడ్, ఉపసర్పంచి పెద్దోని యాదయ్య, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, బ్యాంకు సిబ్బంది గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం సర్వేకు రైతులు సహకరించాలి



అచ్చంపేట, నవంబర్ 5 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రభుత్వం అచ్చంపేట మండలాన్ని కరువు ప్రభావిత మండలంగా ప్రకటించింది. దీంతో అన్ని గ్రామాల్లో పంట నష్టం సర్వే కొనసాగుతోందని మండల వ్యవసాయ అధికారి కె. కృష్ణయ్య తెలిపారు. గురువారం ఐనోల్ గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. చంద్రశేఖర్‌తో కలిసి సర్వేను పరిశీలించారు. వాస్తవ పంట నష్ట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులకు సహకరించాలని కోరారు. సర్వేకు జిరాక్స్ పత్రాలు అవసరం లేదని, పొలంలో పంట తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఇప్పటికే కోత పూర్తయిన పంటలకు సర్వే వర్తించదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈఓ పి. విజయ్ కుమార్, బీటీఎం సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మత్తు వదలరా యువతా..!

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు...

దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం. శాస్త్ర, సాంకేతిక, విద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో యువత తమ ప్రతిభను చాటుకోవాల్సిన అవసరం ఉంది. అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిసలైతే వారి వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాల భవిష్యత్తు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. యువతలో ఉన్న శక్తి, సామర్థ్యాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

తల్లిదండ్రుల పర్యవేక్షణతో పాటు సమాజ బాధ్యత అవసరం...

పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించడం, వారి స్నేహాలు, అలవాట్లు, రోజువారీ కార్యకలాపాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. అదే సమయంలో పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపాధి నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా యువతను మంచి మార్గంలో నడిపించాలి.

అక్రమ మట్టి రవాణాతో ప్రభుత్వ ఖజానాకు గండి

అక్రమ మట్టి రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ వ్యాపారస్తులకు డబ్బులకు ఆశపడి మట్టి అక్రమ రవాణ దారులకు సహకరిస్తే ప్రభుత్వ పరంగా మంజూరయ్యే అభివృద్ధి పనులకు మట్టి కరువవుతుందని గ్రామాలలో ప్రభుత్వ పథకాల అభివృద్ధి పనులకు మట్టిని అనుమతిస్తూ అక్రమదారులకు ఎలాంటి పర్మిషన్ ఇవ్వకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులు ఆయా గ్రామాల ప్రజా ప్రజలపై ఉందని ప్రజలు కోరుతున్నారు.

ముునుముందు రాబోయే కాలంలో మట్టి కోనలేని పరిస్థితిలో అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయే అవకాశం ఉన్నందున అధికారులు దృష్టి సారించి మట్టి అక్రమ రవాణా ని అరికట్టవలసిందిగా మండల ప్రజలు కోరుతున్నారు.

స్వీపర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి: మోష



వనపర్తి, నవంబర్ 5 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాల స్వీపర్లకు ఉపాధి హామీ కూలీల కంటే తక్కువ వేతనం ఇస్తున్నారని, నెలకు కనీసం రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన స్వీపర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు రూ.5,200 మాత్రమే చెల్లిస్తున్నారని, ఆ వేతనం కూడా ఐదు, ఆరు నెలలకు ఒకసారి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దశాబ్దాలుగా పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ నెల 29న జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గోపాలకృష్ణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారిణులే దేశ భవిష్యత్తు



మక్తల్, నవంబర్ 5 (జనంసాక్షి): మక్తల్‌లోని ఎల్లమ్మకుంట-కొత్త గార్లపల్లి రోడ్డులో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ ట్రాక్ సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మొత్తం 176 మంది బాలికలు, మహిళలు పాల్గొన్నారు. గ్రామీణ క్రీడాకారిణులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించినట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే సౌత్ జోన్ జాతీయ పోటీలకు 92 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. విజేతలకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించిన పీడీలు, పీఈటీలను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శేరుపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం



శ్రీరంగాపూర్, నవంబర్ 5 (జనంసాక్షి): మండలంలోని శేరుపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య ఆరోగ్య, సంతానోత్పత్తి శిబిరం నిర్వహించారు. 24 మంది రైతులు తీసుకొచ్చిన 50 పశువులకు (32 గేదెలు, 18 ఆవులు) వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భకోశ సమస్యలు, సంతానోత్పత్తి లోపాలను గుర్తించి చికిత్స అందించారు. దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. పశుగ్రాసం అభివృద్ధి, వీబీజీ రామ్‌జీ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వెంకటయ్య గౌడ్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ మాధవి, సర్పంచ్ మేకల వెంకటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.